

BHAKTHI



Kavishiromani

Prof. R. VASUNANDAN

భక్తి



కవిశిరోమణి

ఆచార్య రావికంటి వసునందన్

భక్తి

(దీర్ఘకావ్యం)

కవిశిరోమణి

ఆచార్య రావికంటి వసునందన్

BHAKTI (Long Poem)
by *Kavishiromani*
Prof. Raavikanti Vasunandan


Prof. Raavikanti Vasunandan
Professor of Telugu
Principal Investigator UGC Major Research Project
Dr.B.R. Ambedkar Open University
Road No.46, Jubilee Hills, Hyderabad-33.
Cell: 9849852182

First Edition: **2009**

Price: **Rs. 30/-**

For Copies:
All Branches of Vishalandhra

Printed at:
Vipla Computer Services
(Designers & Multicolour Offset Printers)
Nallakunta, Hyderabad - 500 044.
Ph.: 2765 4003, 2767 6910, 27677078



నడిచేదేవుడు

బ్రహ్మశ్రీ సద్గురు డా. కె. శివానందమూర్తి గారికి

భక్తితో

- వసునందన్

భక్తిరసాకృతి

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధానకార్యదర్శి, ఆంధ్రసారస్వతపరిషత్
హైదరాబాదు

ఈ కావ్యం ఒక భక్తి రసకుల్య. మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, పతిభక్తి, దేశభక్తి రంగరించుకున్న వచన కవితాకృతి ఈ కృతి. డా. వసునందన్ గారు మానవతా సిద్ధాంతాన్ని అస్థిగతం చేసుకున్న విద్వాంసులు. మానవతా విజ్ఞానసాగరంలో అనేక భావాలు తరంగరూపాలే కదా!

భక్తి వట్టి దాస్య శృంఖలం కాదు. భక్తి ఒక శక్తి. అంగీకరించగలిగితే ఒక దివ్య శక్తి. విశ్వాంతరాళంలో ఈ దివ్యశక్తి అనేక ముఖాలుగా, అనేక రూపాలుగా అవతరిస్తుంది. ఎక్కడ శక్తి ఉందో అక్కడ భక్తి ఉంది. ఎక్కడ భక్తి ఉందో అక్కడ శక్తి అవతరిస్తుంది. శక్తి ఎక్కడ ఏ విధంగా రూపుదాల్చుతుందో అక్కడ విభూతులు వెలుగొందుతాయి. అదే విశ్వరూప సందర్శనం. ఈ కృతిలో వేదాంతుల ప్రసక్తి ఉంది. పురాణ పురుషుల ప్రస్తావన ఉంది. చారిత్రక పురుషుల ప్రసక్తి ఉంది. ఆధునిక సమాజాన్ని తీర్చిదిద్దిన నేతల ప్రస్తావన ఉంది. ఎవరెవరి లక్షణాలు ఎలాంటివో వివరించిన వైనం ఉంది. ఇది విశ్వావలోకం, విశ్వంభరావలోకనం. విశ్వరూపావలోకనం.

శ్రీరామ భరత లక్ష్మణుల ప్రసక్తిలో భ్రాతృభక్తి పారవశ్యాన్ని గాఢంగా చిత్రించారు డా. వసునందన్ గారు. వారి కవితా వైదగ్ధ్యానికి ఇది ఒక ఉదాహృతి.

"అన్నకోసం సర్వరాజ్యాన్నీ సమర్పణ చేసిన భక్తి
పాదపద్మాలు దూరమైనా పాదుకలే సర్వస్వమని పొంగిన మనశ్శక్తి

అహర్నిశలూ అన్నపానాలు మాని
కంటిలో వత్తులు వేసుకొని కాపున్న అనురక్తి"

ఉదాహరించవలసి వస్తే మరి ఎన్నో చరణాలు ముందుకు వస్తాయి.

డా. వసునందన్ గారు ఈ కృతి ద్వారా ప్రకృతిలోని వైరుధ్యాలను, వైమనస్యాలను, ప్రేమను, ద్వేషాన్ని ఎంత వరకు సమరసపరచుకోవచ్చునో వర్ణించిన తీరు అభినందనీయం. ఈ కృతి ద్వారా వారి హృదయంలోని భక్తికి ఆకృతి ఇవ్వడం హర్షదాయకం.



కవిశిరోమణి
ఆచార్య రావికంటి వసునందన్

జననం : 04.05.1949

జన్మస్థలం : కమాన్‌పూర్
కరీంనగర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

తల్లిదండ్రులు : కీ.శే. శ్రీమతి జగ్గమాంబ, శ్రీ కిష్టయ్య

విద్య : ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి

ఉద్యోగం : తెలుగు ప్రొఫెసర్
ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, యు.జి.సి. మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్
డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

రచనలు

కథా కావ్యాలు

రతీప్రద్యుమ్నము (గద్య కథాకావ్యం - 1971)
గురుకులము (విమర్శనాత్మక గద్య కథాకావ్యం - 1978)
భారతం (పద్య కథాకావ్యం - 1980 - డా॥ దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారకపురస్కారం పొందిన కృతి)
బలి (గేయ కథాకావ్యం - 1981)
కృష్ణం కలయ... (పద్య కథాకావ్యం - 2009)
అష్టాక్షరి (పద్య కథాకావ్యం - 2009)

దీర్ఘ కావ్యాలు

త్రయి (1982)
మనస్సు (2004)
పిల్లలమఱ్ఱి (2006)
మట్టిముద్దలు (2007)
ఆయుధం కవిత్వం (2007)
ప్రవాహిని (2008)
భక్తి (2009)

గేయ కావ్యాలు

శ్రీరామ చరితామృతమ్ (పాటల్లో రామాయణం - 1992)
శ్రీవేంకటేశ్వర తారావళి (సంకీర్తనలు-2005)
ఎందరో మహానుభావులు (జీవిత చరిత్రలు - 2006)

సాహితీ విమర్శ - పరిశోధన

భావదీపికలు (సాహిత్య వ్యాససంపుటి - 1980)
భూమిక - ఒక సమగ్ర పరిశీలనం (ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం - 1985)
అష్టాక్షరి (సినారె కృతులపై సాహిత్య వ్యాసాలు - 1987)
ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం - విశ్వంభర విలక్షణత
(పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం - 1990)

వచన కవితలు

సాధన (కవితా సంపుటి - 1981)
కలం కదిలితే... (కవితాసంపుటి - 2003)
మెరుపు మెరిస్తే... (కవితా సంపుటి-2004)
వాన కురిస్తే... (కవితా సంపుటి-2005)
నేల నవ్వితే... (కవితా సంపుటి-2006)
మనసు నిండితే... (కవితా సంపుటి-2006)
సింగిణీ మొలిస్తే... (కవితా సంపుటి-2006)
నెమలి ఆడితే... (కవితా సంపుటి-2008)
గుండె పొంగితే... (కవితా సంపుటి-2009)

వివిధ కృతులు

వేణీ సంగమం (గేయం, పద్యం - 1975)
ప్రజావిజయం (రేడియోరూపకం - 1990)
ప్రయోజన దండకాలు (దండకాలు - 1993)
జైగణేశ్, బాలాజీ (భక్తిపాటల ఆడియో క్యాసెట్స్ - 1994)
లోవెలుగు (ముక్తకాలు - 2004)
రావికన్నులు (సంక్షిప్త కవితలు-2006)
అనుయోగం (త్రిపదులు-2009)
అడుగడుగునా! (సంక్షిప్త కవితలు-2009)

బాల సాహిత్యం

బాలజ్యోతులు (పిల్లల కథలు-2007)
బాలబ్రహ్మం (దీర్ఘకావ్యం-2008)

అనువాదాలు

దౌడ్ (హిందీ అనువాదం) డా.ఎం.రంగయ్య (2006)
రెసొల్యూట్ మైండ్ (ఇంగ్లీష్ అనువాదం) డా.బి.రామచంద్రయ్య (2006)
విరాట్ ఏకతా వట్ (హిందీ అనువాదం) డా. ఎం. రంగయ్య (2008)

ముద్రణలో

భారతనారీమణులు (పిల్లల కథలు)
భక్తశిఖామణులు (పిల్లల కథలు)

పురస్కారాలు

ఎ.పి.ఎ.యు.యస్. సమాఖ్య కడప స్వర్ణపతక పురస్కారం (1982)
డా. దేవులపల్లి కృష్ణశాస్త్రి స్మారక పురస్కారం, హైదరాబాద్ (1982)
శ్రీ జమిలి నమ్మాళ్వార్ స్మారక పురస్కారం, హైదరాబాద్ (1990)
శ్రీ తేరాల జగదీశ్వర్ స్మారక పురస్కారం, హైదరాబాద్ (1993)
శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ ఉత్తమ విద్యావేత్త పురస్కృతి, హైదరాబాద్ (1993)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కృతి, హైదరాబాద్ (2002)
డా. వానమామలై వరదాచార్య సాహిత్య పురస్కారం, కోరుట్ల (2003)
కవిశిరోమణి బిరుదప్రదానం - భారతీ సాహిత్య సమితి, కోరుట్ల (2003)
డా.జె.ఆర్.ఇ.టి.రజతోత్సవస్వర్ణపతక,స్వర్ణకంకణపురస్కారం,జగిత్యాల (2003)
వానమామలై జగన్నాథాచార్య సాహిత్య పురస్కారం, కరీంనగర్ (2004)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం, హైదరాబాద్ (2004)
పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ధర్మనిధిపురస్కారం, హైదరాబాద్ (2004)
ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం - భాషావేత్త పురస్కారం, రంగారెడ్డి (2006)
శ్రీ దోమా వేంకటస్వామిగుప్త సాహిత్య పురస్కారం, కడప (2007)
తేజ ఆర్ట్ క్రియేషన్స్, సాహితీ పురస్కారం, హైదరాబాద్ (2007)
భారత పర్యావరణ పరిరక్షణ గవాక్షం - రంగారెడ్డి జిల్లా పురస్కృతి (2008)
తేజ ఆర్ట్ క్రియేషన్స్-ఆచార్య తిరుమల సాహితీ పురస్కారం, హైదరాబాద్ (2008)

1

ఆర్ద్ర భావాలన్నీ తదేక ధారగా
అలుగులెత్తే మానసిక స్థితి
భక్తి.
దానికి లేవు ఎల్లలు
దానికి తెలియవు కల్లలు
అనంతం అద్వితీయం అమోఘం
ఆనంద సాగరం.

2

కండకు కండ పొదిగి
గుండెకు ఊపిరులూది
నరాలకు నెత్తురులు పూసి
పేగు తెంచి వ్యక్తిత్వానికి తలపాగా చుట్టే
అమ్మ
ఏదీ సాటి రాదు
విశాల విశ్వప్రకృతిలో.

కారుణ్య కల్పవల్లి
మమతల పాలవెల్లి
అనురాగాల దేవమల్లి
కన్నతల్లి.

విశ్వరహస్యాల దొనలు అమ్మ కనులు
అమృతపు గనులు తల్లి చూపులు
పొరలు పొరలుగా పేరుకొన్న
సృష్టి తేనెపెర మాతృగర్భకోశం
తెరలు తెరలుగా పొదవుకొన్న

దివ్యరక్తావేశం తల్లిపేగు పాశం-
మాతృప్రేమామృతంలో తడిసి ముద్దైన
మహనీయ భక్తి మూర్తులు ఎన్నెన్ని భవ్యస్ఫూర్తులు?
కాలప్రవాహం కడుపు పడకల్లో.

3

అమ్మ అడుగులు మెట్టి
అమ్మ నుడుగులు పట్టి
అంబరం అంచులకెదిగిన అసామాన్య మూర్తులు
అనన్య తేజో విరాజితులు
బాలగణపతి, గరుత్మంతుడు
శివాజీ, గాంధీ.

బొమ్మను చేసి జీవంపోసిన అమ్మకోసం
ఆత్మార్పణలో అడుగుసారించిన
అర్భక ప్రాణం
కపాలి త్రిశూలాన్నీ నిటాల దృక్పాతాన్నీ
లెక్క సేయని తెంపరితనం,
అమ్మంటే అమ్మే!
అన్నిటికన్నా ఎక్కువ అమ్మే!

పసిబాలుడికి చేసింది పట్టాభిషేకం
గజాస్యుడికిచ్చింది గాణాపత్యం
మొట్టమొదటి మొక్కు వినాయకుడికే
అందించి అందలం ఎక్కించింది
మాతృభక్తి.

అన్నివేళలా పనిచేయవు
పిక్కబలం రెక్కబలం
అందునా ధర్మపాశాలు కట్టిపడేస్తే.

అన్యాయ పథగామిని అమ్మ చెల్లి
ప్రజాపతిని చేపట్టినా ప్రశమించని మాత్సర్యం-

బంధించిన మాతృభక్తితో భరించాడు
జూలు దులిపితే చాలు గాలికి ఎగిరిపోయే
చిల్లర నాగుపిల్లల అల్లరి సహించాడు
మూసిపెట్టిన సింహకిశోరంలా గరుత్మంతుడు.

ఎవని రెక్క తగిలితే సురనగరి సుడివడుతుందో
ఎవని ఈక ప్రఘాత వజ్రసదృశమో
అంత బలవంతుడు గరుత్మంతుడు
అణిగిమణిగి పడి ఉన్నాడు అమ్మకోసం
అన్ని పనులూ చేస్తూ
పైనపాకే పాముల జలదరింపులు మోస్తూ.

అంతటి సహనం అంతా చూసింది కద్రువ
అమృతభాండం తెచ్చి ఇమ్మని ఆంక్షపెట్టింది
దుర్భర మాతృదాస్యం తొలగాలంటే,
అసాధ్యమేమున్నది అతని మాతృభక్తికి
అగమేఘాలమీద అమరేంద్రుని జయించాడు
అమృతం సాధించాడు అమ్మచెర విడిపించాడు

కన్నతల్లికి చేసిన అతని ఎన్నలేని సేవ
ఆకాశం హద్దులు దాటి ఎదిగింది
కమలనాభ సువర్ణ సుపర్ణ రథసేవగా
అనుపమాన తేజః పరమావధిగా.

కొండకోటలకు లగ్గలు పట్టిన వీరుడు
అలవికానప్పుడు కొండకోనల తలదాచుకొన్న ధీరుడు
ఔరంగజేబు గుండె గడగడలాడించిన కొండ ఎలుక
ఛత్రపతి శివాజీ!

మాతృపదేశ సిద్ధుడు మాతృదేశ సంస్కృతీ నిబద్ధుడు
హైందవ ధర్మ పరిరక్షణార్థం
ఆకాశం ఎత్తు సంకల్పంతో
నడుం కట్టిన పొట్టి పిడుగు శివాజీ
ఆయన చేతివ్రేళ్ళు పులిగోళ్ళు
కాళ్ళు కొదమసింహపు కాళ్ళు
దుర్గా వరదత్త కరాళ ఖడ్గధారి
కర్కశ శాత్రవ కంఠలుంఠనధారి.

ఎంతకమ్మనో అమ్మ జిజియాబాయి
ఉగ్గుపాలతో రంగరించి పోసిన నూతనోత్తేజం
తల్లి నేలమీది తరగని భక్తి
కన్నసంస్కృతి మీది అనురక్తి

శౌర్య ప్రతాప నిధియై సుగుణ జలధియై
అవతలివారెన్ని అకృత్యాలు చేసినా
విపక్షం అబలలనూ ఆర్తులనూ అంటని ఔదార్యం

అధర్మాలను అణచివేసి
అనుకున్నది సాధించేదాకా కునుకుతీయని పరాక్రమం
శివాజీ కత్తికి ఇరుపక్కలా మెరుపులద్దిన
వాడి వాదరలు

అమ్మమాటలే పెట్టుబడి అతని విజృంభణకు
అమ్మ ఆరాధనే రహదారి అతని విజయ పరంపరకు.

సత్యాగ్రహ ధర్మ విస్ఫూర్తి
స్వాతంత్ర్యోద్యమ జలసంధి
మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ!
పేరుకు తగ్గ వెలుగులద్దే కర్మచంద్రుడు
కర్తవ్య నిర్వహణలో శుభ్రజ్యోత్స్నలు విరబూసే జాతిపిత.

పసితనంలో సత్యహరిశ్చంద్ర నాటక సందర్శనం,
సత్యమే సర్వధర్మాలకు మూలమనీ
సకల సత్పథ సారమనీ సత్యాన్నే పలుకుమనీ
ఉపదేశించిన చల్లని తల్లి పుత్లీబాయి
మాట జవదాటని మాతృభక్తుడు
స్వతంత్ర నవభారత పితృస్వరూపుడు గాంధీ.

ఉప్పు పిడికిలిని ఉక్కు ముక్కులు పొడిచినా
పోరాటం వెన్నెముకను వెర్రిలాఠీలు విరిచినా
జాతీయతను సత్యప్రమాణంగా నమ్మి
జాతిని నడిపించిన నేతగాంధీ

సత్య సూర్యోదయానికి తొలి ఉషస్సు తల్లిమాట
గాంధీ మహాత్మ మహస్సు అమ్మభక్తి.

4

అమ్మ అన్నపూర్ణ ఐతే
కన్నతండ్రి జీవితాశయాలకు సానలుపట్టే
పరమేశ్వరుడు
తగినంత కాఠిన్యం తప్పదు ఒరిపిడిలో
కాంతి స్వరూపావిష్కరణలో.

బిడ్డ బతుకు పంటకోసం
ఇరువాలు దున్నే నాగలికర్రు తండ్రి
కాలువలు మలిపే పార అంచు తండ్రి.

తల్లి ద్రాక్ష ఐతే తండ్రి నారికేళం
గుండె పొరల అట్టడుగున పారే
అమృతతుల్య సంజీవనీ కుల్య
సంతానం జీవన సస్యానికి కంచె
పరిరక్షణోద్యోగంలో పగలూ రేయీ
నిర్నిద్రమైన మంచె
అమ్మ ప్రేమార్ణవమైతే
అయ్య సంక్షేమ జలధర స్వరూపం.

5

పితృభక్తితో పునీతులైన పుణ్యశ్లోకులు
పరశురాముడు, శ్రీరాముడు, భీష్ముడు
నచికేతుడు, భారవి.

ప్రజ్వలించిన పితృవాక్యపాలనాయజ్ఞం
కన్నతల్లి తలనే తరిగిన "తండ్రి శక్తిమీది" నమ్మకం
భయదోగ్రవ్రతనిష్ఠలో
నరరూప రాక్షసులైన ధరాపతుల కవోష్ణరక్తధారలతో
ఏకవింశతి పర్యాయాలు గండ్రగొడ్డలిని తడిపిన
తండ్రిమీది ప్రేమ.

క్షణమైనా విడిచి ఉండలేని తండ్రి
అసిధారావ్రత సత్యసమాచరణలో
తన విధి నిర్వహించే పితృవాక్యపాలనలో
గుండెలు పిండే వేదనలో
కన్నతల్లినీ సంపన్న ప్రభుత్వాన్నీ పరిత్యజించి
కట్టుబట్టలతో కట్టుకొన్న భార్యతో
గహనాలకు తరలిన
గణనీయ త్యాగధర్మ పరాయణ పితృభక్తి.

ఇహలోక సౌఖ్యాలనూ
సర్వ సర్వంసహా భోగాలనూ తృణీకరించి
ఎవరు రాజ్యమేలినా ఆజన్మాంతం సేవిస్తాననే భీష్మం
స్వచ్ఛంద మరణ ప్రభావ పరిపూర్ణం
గడ్డకట్టిన పితృభక్తి.

అందరికన్నా అధికుడు అందాల బాలుడు నచికేతుడు
తండ్రి మాటతో దండధారి సన్నిధికే తరలిపోయిన ధైర్యం,
అంతకుని బండగుండె కరిగించి
చావుపుట్టుకల రహస్యాలను బట్టబయలు చేసిన
మొట్టమొదటి జ్ఞాన బుద్ధి
త్రిలోకాలలో సరిసాటిలేని వ్యక్తిత్వ సిద్ధి

ఎంత శక్తిమంతం మాత్సర్యం!
నిత్య సంక్షేమకాంక్షి కన్నతండ్రినే కడతేర్చాలనుకునే అసూయ
గుదిబండను సంసిద్ధం చేసుకున్న కసాయిగుండె
తప్పు తెలుసుకొని పితృదేవుని పాదాలు కడిగిన కన్నీటి కవ
ప్రాయశ్చిత్త ఫలితం అతిహేయమైన అత్తింటి ఊడిగం.

మండుటెండ ఎడారిలో పొంగిన మహాకవిత్వ గంగ
కిరాతార్జునీయం.

ఎందరెందరు మహనీయులు పితృభక్తి పరాయణులు
ఎందరెందరు మహితాత్ములు మాతృభక్తి మహిమాన్వితులు
పుట్టంధులు తల్లిదండ్రులను

కన్నులలో వత్తులు వేసుకొని కావడి తట్టలలో మోసి
నిరంతర సంసేవలో భుజాలు కాయలుగాచి
నిలువెల్లా తనువు పండిన
అద్వితీయ పరిచర్యామరకీర్తి శ్రవణకుమారుడు
ఎంతధన్యం మాతృభారతి
ఎంత అగణ్యం ఈ నేల ఈ గాలి.

6

పరువు పెంచే గురుత్వాకర్షణ శక్తి గురువు
భూగోళం ఖగోళం దాటి
సూటిగా పరతత్త్వం దాకా దూసుకుపోయే
అమోఘశరం గురువు ఆశీర్వాదం
అన్నిటికన్నా బలం గురుబలం
అందిస్తుంది సద్యఃఫలం
ఆశించిన మరుక్షణం.

7

సృష్టిలో అత్యద్భుత తార్కాణం
గురుభక్తిలో అద్వితీయుడు ఏకలవ్యుడు
అతని తర్వాతనే ఎవరైనా.
సంఘనియమాల భీతితో
శుశ్రూషను గురువు నిరాకరించినా
అమోఘ సంకల్ప శుద్ధితో మట్టి బొమ్మకు మొక్కి
అనితరసాధ్య శరవిద్యా సిద్ధిపొందిన
అనన్య ప్రతిభాశాలి.

ఆప్త శిష్యునిమీది అపార వాత్సల్యంతో
గురువు కోరిన దాక్షిణ్యదూర దక్షిణకు
అణుమాత్రమూ సంశయించక సంచలించక
కుడిచేతి బొటన వేలు ఛేదించి
అసామాన్య రక్తతర్పణగా సమర్పించిన త్యాగమూర్తి.

భస్మమైన మహావృక్షాన్ని
పచ్చగా నవనవలాడించే తపశ్శక్తీ
కుండలీంద్రుల చెవులు పిండి

గురుపత్ని కోసం మణికుండలాలు తెచ్చే ఆత్మశక్తీ
అన్నిటినీ పెనవేసుకున్న మహా గురుభక్తీ
ఉట్టంకిస్తే పైలశిష్యుడు ఉదంకుడు.

తాను పరిపూర్ణావతారమైనా
పరిపూర్ణతకోసం లోకాదర్శంగా
గురుకులాన్ని విద్యాభ్యాసంతో పునీతం చేసిన
భువన మోహనుడు శ్రీకృష్ణ పరమాత్మ
పుత్ర శోకంతో కడుపు చుమ్మలు చుట్టుకు పోతున్న
సాందీపని హృదయసాంత్వనంగా
సమవర్తి అదుపులో ఉన్న గురుపుత్రుని తెచ్చియిచ్చిన
పరబ్రహ్మ స్వరూపుడు
గురుభక్తికి అపూర్వ నిదర్శనమైన లోక గురువు శ్రీకృష్ణుడు.

8

చిన్నతనం నుండే అత్యంతాప్తుడు
వేలు పట్టుకొని నడిపించే అన్నయ్య
తండ్రి తరువాత తండ్రి.

అన్ని విధాలా ఎన్నదగిన నేస్తం
అరవిచ్చిన పూపవయసులో
అవతలి పరిచయాలు గట్టిపడనప్పుడు
ఆత్మీయతా బంధాలు విస్తరించనప్పుడు

9

అన్నకోసం సర్వరాజ్యాన్నీ సమర్పణ చేసిన భక్తి
పదపద్మాలు దూరమైనా పాదుకలే సర్వస్వమని పొంగిన మనశ్శక్తి,
అహర్నిశలూ అన్నపానాలు మాని
కంటిలో వత్తులు వేసుకొని కాపున్న అనురక్తి
ఎంత ప్రేమ మందిరమో అనుజన్ముల సంసక్తి
ఎంత భక్తి బంధురమో అన్న మీద తమ్ముల ఆసక్తి.

ఒక్కొక్కరూ ఒక మత్త దిగ్గజం
అడచికొట్టినా అమ్ము విడిచినా
దిక్కులు పిక్కటిల్లే శౌర్య ప్రతాపం
ఒకరు పోటుగాడు ఇంకొకరు వేటుగాడు
విరుచుకుపడే కొండకొమ్ము ఒకరైతే
కరచుకుపోయే గరుత్మంతుడు మరొకరు
గదతో గాండీవంతో గాండ్రించే బెబ్బులులు
ఆత్మభంగమౌతున్నా అన్నగారి ఒక్క చూపుతో
అక్కడే ఆగిపోయిన ఆ దృశ్యం
భ్రాతృభక్తి పారవశ్యం.

10

సృష్టిలో అద్వితీయశక్తి పతిభక్తి
ఎంత శక్తిమంతమో అంత ఆశ్చర్యకరం!
అసురులకైనా అతివల అనురాగమే రక్షాకవచం
తప్పొప్పులన్నీ తనలో విలీనం చేసుకునే
మహాసాగర గర్భ సదృశం
సతుల పతిభక్తి గంగలో పునీతులైన ఎందరో పతులు

పతి భక్తి తొడిగిన సహన శీలంలో
అనసూయతలో వినీతులైన త్రిలోక నాథులు
కొత్తదనం పులుముకున్న కోమలాంగులు
మురిసి ముద్దగట్టిన ముగురు మూర్తులు.

11

ఎవరికెవరు చేస్తారు పరిచర్యలు ప్రాణప్రదంగా
ఏకాలంలోనైనా మనసు పెట్టి నిస్వార్థంగా
ఒక్క పతిభక్తిలో కాక.

నివ్వెరపడి నిలువుగుడ్లతో నిలిచి చూస్తారు సూర్య చంద్రులు
జోహార్లు చేసే రిక్కల నడుమ దిక్కుల నడుమ
నిశ్చేష్టమౌతాయి ఊపిరాడని అంబుధులు
కాళ్లూ చేతులూ కదలని కాలం
భర్త తలపుండ్లు కడిగి
తలను కట్టుకు కాచే ధర్మపత్ని తపోగ్ని జ్వాలను,
కాలయమునికే కాక పుట్టించే అగ్ని కీలను,
కాయగసురులు కమ్మనగా కట్టుబట్టలతో కానలకు
కదలిన పరమ సాధ్వి,
కట్టుకొన్న వాని మాటకోసం
నిండు బతుకు కాటగలుపుకున్న మహారాజ్ఞి,
భర్తృ సంక్షేమ పథంలో నడిచి
అన్ని కాలాలకూ అడుగుజాడలు వదలిన
సుదతీ మణులు సుగుణ ఖనులు

12

జన్మ జన్మల పుణ్య సంస్కారం
చర్మ చక్షువులకు గోచరించని దేవుని మీది భక్తి
సర్వకార్య కారణుడు భగవంతుడేననే విశ్వాసం.

ఒకమత్తు దైవ భక్త్యావేశం
ఒక బాల్యం, ఒక ఉన్మాదం, ఒక దయ్యపు పూనకం,
భగవత్తత్త్వం తప్ప మరేదీ సోకని
ఒక నిరంతర తన్మయత.

ప్రవృత్తికీ ఐహికానికీ స్వస్తి
నివృత్తికీ ఆముష్మికానికీ స్వాగతం

అంతరంగం ఆనందసాగరం లోకమంతా శోకరహితం
దైవభక్తి ఒక్కటి ఉంటే!

13

శ్రవణం మొట్టమొదటి మెట్టు దేనికైనా
నిరీక్షించి, విన్నది పరీక్షించి
ఆచరణశీలంతో సాగితే అనంతశాంతి.

స్మరణం చింతనం రక్షక దళాలు
దైవభక్తి అంకురానికి
కుడి ఎడమల చేరిన పరమ పావన వికాసాలు
రోమకూపాలలో పులకలెత్తే
మనోభిరామ రూపాలు.

తులసీ దళాలలో పల్లవించిన పరమభక్తి శ్రీపదార్చన
ఆముక్తమాల్యదా పరమప్రేమగా పరిమళించి
విష్ణుచిత్తమై మారాకు హత్తే మధురక్షణం.

సాధ్యం కానిది లేదు విరబూసే నిత్య సఖ్యంలో
నరనారాయణ పరత్వంలో కుచేల దారిద్ర్యంలో
కల్లలెరుగని గొల్లపిల్లల్లాంటి అమాయక మనస్తత్వంలో.

బ్రహ్మకైనా పాదసేవే పరమావధిగా
సకల పాప విభంగ గంగగా
పరతత్త్వ ఫలరసాన్ని పట్టి ఇచ్చే పారవశ్యం.

నాభి పునాదిలో లేచిన వాగ్వైఖరి
సప్తస్వర ప్రస్తార పక్షాలు తొడుగుకొని
నాదమై సంకీర్తనవేదమై కలస్వనవినోదమై
గళమెత్తిన భక్తివిహాయస విహంగమై
తుంబుర నారదుల నుండి రామదాసు త్యాగయ్యల దాకా
మేరలు మీరాలనే పొంగుతో
తీగసాగే లీల సంగీతసాగరంలో ఓలలాడే వేళ.

దైవాన్ని గుండె పానుపు తొక్కించుకొని
మూపు మీద ఎక్కించుకొని
అనంత గరుత్మంతమై విహరించే సేవా మానసహంస
దాస్య భక్తిలో ఏండ్లకేండ్లుగా కన్నుమూయని ధ్యాస
అన్నం అంటని శ్వాస.

అభివందన సుమచందన సమర్పణంలో
ముకుళితాంభోజ హస్త పరాయణులై
భీష్మించుకొనే భక్తి జీవులు.

అన్నిటికీ అంతిమగమ్యం ఆత్మలో నెరుక
అది అనన్యం అగణ్యం అమేయం అద్భుతం
ప్రహ్లాదం.

తొమ్మిది విధాలా వికసించే
మనోవరణాన్ని
దశదిశలా చుట్టుముట్టే విలక్షణ దైవభక్తి
వైరం
ఏ కళనైనా స్మృతి చెదురుతుందేమో మైత్రిలో!

వైరంలో అది సాధ్యమా మరి?
అన్ని వేళలా అన్ని చోట్లా.

దైవాన్ని ప్రభువనే కాదు
బోరుకాడించి ఉగ్గుపోసి
పసిపాపగానూ సేవించే భక్తి
వాత్సల్యంగా అనసూయగా
కౌసల్యగా యశోదగా
అమ్మవ్వగా.

ఎంత భావించినా అంతులేనిది
సరిసాటిలేనిది జీవన్ముక్తి మార్గాలలో సూటిది
దైవభక్తి.

14

దేశమంటే మనుషులు కాదు మనసులు
కలుపుగోలు తనంతో పెనవేసుకున్న మమతలు
తల్లికన్నా ఎక్కువ తల్లినేల
జీవితాంతం పెంచి పోషించే దివ్య హేల
ఆ చల్లదనం పులుముకున్న గుండెలతో
బంగారు జీవన హారతులెత్తిన వేనవేల ఆదర్శ మూర్తులు
తరతరాలకూ తరగని కాంతినిధి విస్ఫూర్తులు.

15

స్వరాజ్యం నా జన్మహక్కని
జాతికి వీరతిలకం దిద్దిన స్వాతంత్ర్యయోధ తిలకుడు
తలపగిలినా తలపు చెదరని గోఖలే
ఉరితాడును విరిమాలగా ముద్దులాడిన భగత్
మాతృదేశభక్తి రౌద్రరసస్ఫూర్తిగా రగిలిన
వీరమార్తాండ ప్రచండుడు బోస్
బోసి నవ్వులో శాత్రవ భయ భ్రాంతులు విరబూసిన బాపూ
రెప్పపాటులేక రేయింబవళ్లూ
సత్య స్వరూపం నీడలా సంచరించిన నెహ్రూ
దేశభక్తిలో ఉక్కుతనం
ఉగ్గుపాలతో బుగ్గనపట్టిన పటేల్
దేశభక్తి గీతాలను చిలకరించిన చిలకమర్తి, బంకించంద్ర, టాగూర్
ఎందరెందరు మహామహులు
పులకలు మొలకలెత్తించే ఘనాఘనులు!

16

మానవసేవే మాధవసేవ
సహజన సమర్చనమే సర్వాత్మకుని సంపూజనం
స్పందించే అన్ని చేతులకూ
అందివచ్చే అమృతఫలం సమాజం
తలపుల్లో కలల్లో తరగలెత్తే పరహితాసక్తి
సమాజభక్తి.

తనతో పెనవేసుకున్న సహచర కూటమిని
సకల చరాచర కోటిని
సంపూర్ణ ప్రేమతో సమాదరించే మనశ్శక్తి
సరిహద్దులు లేని సమాజ భక్తి.

17

ఎవరు చెప్పారు మిరపకాయకు?
గిరిజనానురాగసుధల టపా బట్వాడా చెయ్యమని
ఎవరు నేర్పారు సమరోగ్రకేసరికి?
తూటాల దండకు గుండె చూపించమని
ఎవరు చూపించారు సరోజినికి దుర్గాబాయికి?
సమాజ సేవాపథాన్ని సర్వత్రా అనుసరించమని
పేద సాదలకు భూదానమే పరమావధిగా వినోబాకు?
సమాజసేవే ఊపిరిగా కందుకూరి గురజాడలకు?
ఏ నిరుపమాన కారుణ్య శక్తి ప్రబోధించింది?
ప్రాణమున్న అబలల వెచ్చనెత్తురు బూడిద చెయ్యవద్దని
రాజారామమోహన్ రాయ్‌ని
సంఘసేవే పరమ శరణమని గౌతమబుద్ధుడిని, వివేకానందను.

ఎవరు నూరిపోసారు?
ఎవరు దారి చూపారు?
అచ్చమైన మానవతారక్తి
పొరపొచ్చెంలేని సమాజ సంక్షేమ భావనాసక్తి.